ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 4 ఏప్రిల్ 2024

శ్రీవారి హుండీ ఆదాయం రూ.36.74 లక్షలు

కదిరి, ఏప్రిల్ 3: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.36.74 లక్షలు వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండోరోజు బుధవారం హుండీ లెక్కిం పు కొనసాగింది. రూ.36.74 లక్షల నగదుతోపాటు 94 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వచ్చిందన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి మండలం వేల్పుమడుగులో పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్ (టీషర్టు వేసుకున్న వ్యక్తి)



- బ్యాంకుల్లో జమకాని సొమ్ము
- రోజంతా సచివాలయ ఉద్యోగుల ఎదురుచూపు
- టీడీపీపై విషం చిమ్మే కుతంత్రం
- లబ్ధిదారులను రెచ్చగొట్టిన వైసీపీ శ్రేణులు
- సచివాలయాల వద్దకు పంపిన వైనం
- అక్కడ హైడ్రామా.. గందరగోళం..
- సగం సచివాలయాల్లో నగదు లేక పంపిణీ వాయిదా
- మధ్యాహ్నం తరువాత కొన్నిచోట్ల ప్రారంభం
- తొలిరోజు 32 శాతం పూర్తి

సోమందేపల్లి సచివాలయం-1 వద్ద నుంచి వెళ్లిపోతున్న పింఛన్‌దారులు



పైసలివ్వకుండా.. పంపిణీ ఎలా?

పింఛన్‌దారులతో వైసీపీ కుట్ర రాజకీయం

అందరూ ఊహించిందే జరిగింది. పింఛన్ పంపిణీలో వైసీపీ కుట్ర రాజకీయం చేసింది. పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిని అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ రాజకీయ కుతంత్రానికి తెరలేపిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పింఛన్ పంపిణీని ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసి, అందుకు టీడీపీదే బాధ్యత అని ప్రచారానికి తెరలేపింది. అంతేనా పలుచోట్ల పింఛన్‌దారులను రెచ్చగొట్టి మరీ వైసీపీ శ్రేణులు, వలంటీర్లు సచివాలయాల వద్దకు పంపారు. అక్కడ కూడా వారిని రెచ్చగొట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉదయాన్నే సచివాలయాల వద్దకు పింఛన్‌దారులను పంపించారు. పింఛన్ సొమ్ము మాత్రం రాలేదు. సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీకి సిద్ధంగా ఉన్నా.. సొమ్ము జమకాక రోజంతా ఎదురుచూడాల్సి వచ్చింది. నిధులివ్వకుండా పింఛన్ ఎలా పంపిణీ చేయాలని వారు వాపోయారు. కొన్ని సచివాలయాల పరిధిలో మాత్రమే పింఛన్ సొమ్ము జమకావడంతో పంపిణీ చేసి, చేతులు దులుపుకున్నారు. చాలాచోట్ల పంపిణీని గురువారానికి వాయిదా వేశారు. తొలిరోజు మొత్తంగా 32 శాతం మాత్రమే పింఛన్ పంపిణీ పూర్తయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి


రొద్దం సచివాలయం-1 వద్ద వేచివున్న వృద్ధులు

- సోమందేపల్లి-1 సచివాలయం వద్దకు పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పెన్షన్ సొమ్ము బ్యాంకులో జమకాలేదని అధికారులు చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.
- రొద్దం సచివాలయం-1 వద్ద పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. సాయంత్రం డబ్బు జమకావడంతో 4గంటల తరువాత పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండలంలోని చిన్న మంతూరు, నల్లూరు గ్రామాల్లో వలంటీర్లు పింఛన్‌కు సంబంధించి స్లిప్పులు పంపిణీ చేశారు. స్లిప్పులు ఉంటేనే పింఛన్లు ఇస్తారని వలంటీర్లు చెప్పడంపై చిన్నమంతూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటేశ్ సచివాలయంలో ఉద్యోగులపై మండిపడ్డారు. ఆధార్‌కార్డుద్వారా పెన్షన్లు పంపిణీ చేయకుండా స్లిప్పులు ఎందుకు ఇచ్చారని సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. నల్లూరు గ్రామంలో స్లిప్పులు ఇవ్వడంపై పింఛన్‌దారులు సచివాలయం వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ.. స్లిప్పులు ఇవ్వాలని తామెవరికీ చెప్పలేదన్నారు. ఆధార్‌కార్డు ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.
- బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో వలంటీర్ దివాకర్ సచివాలయ ఉద్యోగితో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు.
- ముదిగుబ్బ మండలంలో పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత పింఛన్ పంపిణీని ప్రారంభించారు.
- గోరంట్ల పట్టణంలోని 1, 2, 5 సచివాలయాల వద్ద పింఛన్ల కోసం వేచివున్న లబ్ధిదారులను రెచ్చగొట్టేలా వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపించాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్.. సచివాలయ అధికారులకు ఫోన్ చేసి, వేచివున్న పింఛన్‌దారులను వెంటనే ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. అనంతరం గోరట్ల 1, 2 సచివాలయాకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. పరిస్థితిని వివరించారు. సాయంత్రం నుంచి గ్రామాల్లోని రచ్చకట్ట, ప్రధాన ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టారు.


ముదిగుబ్బ సచివాలయం-2 వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ఉదయం నుంచి హైడ్రామా

సామాజిక పింఛన్ల పంపిణీలో వైసీపీ రెచ్చగొట్టి విషం చిమ్మింది. జగన్ సర్కారు పింఛన్ డబ్బు జమ చేయకనే సచివాలయాలవద్దకు పింఛన్‌దారులను రెచ్చగొట్టి పంపించి, టీడీపీపై నెపం నెట్టే యత్నం చేసి సానుభూతి పొందే పన్నగానికి తెరలేపింది. జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో సచివాలయాల వద్ద ఉదయం నుంచి హైడ్రామా సాగింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ద్వారా పింఛనుదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని కలెక్టర్లు చెప్పినా, సచివాలయం వద్ద పంపిణీ చేస్తే వృద్ధులు, దివ్యాంగులు వింతతువులు, ఒంటరి మహిళలు ఇతర పింఛన్‌దారులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావని తెలిసినా పట్టించుకోలేదు. సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో దివ్యాంగులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనవారు వీల్‌చైర్‌లో ఉన్నవారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందే వృద్ధ వితంతువులు మినహా లబ్ధిదారులందరూ సచివాలయాల వద్దకే ఇచ్చి పింఛన్ తీసుకోవాలంటూ ఉత్తర్వులిచ్చారు. జిల్లాలో అన్ని పింఛన్లు కలిపి 2,72,767 ఉన్నాయి. బుధవారం పింఛన్ సొమ్ము పంపిణీ ప్రారంభంతో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైసీపీ నేతలు, వలంటీర్లు మంగళవారం రాత్రి నుంచే రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకెళ్లి.. సచివాలయానికెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాలని రెచ్చగొట్టి పంపించారు. దివ్యాంగులు, అనారోగ్యంతో మంచం, వీల్‌చెయిర్‌పై ఉన్న వారికి ఇళ్ల వద్దే సచివాలయ ఉద్యోగులు వచ్చి పంపిణీ చేస్తారని ఈనెల ఆరోతేదీదాకా అందజేస్తామని చెప్పిన వారిని సైతం సచివాలయల వద్దకు వెళ్లేలా వైసీపీ శ్రేణులు, వలంటీర్లు కుట్రలు చేశారు. అంతటితో ఆగకుండా ఇక నుంచి సచివాలయం వద్దకెళ్లి, పింఛన్ సొమ్ము తెచ్చుకోవాల్సి ఉంటుందనీ, ఇందుకు టీడీపీ కారణమని పింఛన్‌దారులను నమ్మించే ప్రయత్నం చేశారు. ఈనేపథ్యంలో ఉదయం 8 గంటలకే నడవలేని వృద్ధుల నుంచి దివ్యాంగులు, అనారోగ్య బాధితులు సచివాలయాల వద్దకెళ్లి, పడిగాపులు కాశారు. పింఛన్ సొమ్ము జమకాలేదనీ, మధ్యాహ్నం తరువాత పంపిణీ చేస్తామని చెప్పి సచివాలయ ఉద్యోగులు.. పింఛన్‌దారులను పంపించారు. జిల్లాలో మధ్యాహ్నం తరువాత హిందూపురం, కదిరి, ధర్మవరంతోపాటు పలు మండలాల్లో పంపిణీ ప్రారంభించారు. పుట్టపర్తి, మడకశిర మున్సిపాలిటీలతో పాటు సగం మండలాల్లో బుధవారం మధ్యాహ్నం తరువాత పింఛన్ డబ్బు జమచేశారు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రం పుట్టపర్తితోపాటు చాలా మండలాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. పంపిణీ ప్రారంభించిన చోట సైతం నెమ్మదిగా అందజేశారు. వైసీపీ కుట్ర, దుష్ప్రచారంపై గోరంట్లలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. పింఛన్ సొమ్ము ఎందుకు పంపిణీ చేయలేదని నిలదీశారు. పింఛన్ల సొమ్ము జమకాలేదనీ, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని ఎంపీడీఓ వెల్లడించారు. ఇలా జిల్లావ్యాప్తంగా వైసీపీ.. పింఛన్‌దారులను ఎగదోసి, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేసింది. వైసీపీ శ్రేణులు, వలంటీర్ల కుట్రలను పసిగట్టిన పింఛన్‌దారులు చాలాచోట్ల వారు చెప్పిన మేరకు సచివాలయాల వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు. ఆరోతేదీదాకా గడువు ఉంది కదా అంటూ చర్చించుకోవడం కనిపించింది. బుధవారం సాయంత్రం ఏడుగంటలకు జిల్లా వ్యాప్తంగా 87 వేల మంది పింఛన్‌దారులకు 32 శాతం పంపిణీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గురువారం అన్ని సచివాలయాల్లో పింఛన్ సొమ్ము పంపిణీ చేపడతామని వెల్లడించారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా పెట్టండి: ఎస్పీ


సైబర్ సెల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సోషల్ మీడియా, సైబర్ క్రైం సిబ్బందిని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని సైబర్‌సెల్ వింగ్‌ను ఎస్పీ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో పాటించాల్సిన ఎన్నికల నిబంధనలను సిబ్బందికి సూచించారు. సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలను పోస్టు చేయరాదన్నారు. ట్రోలింగ్, అన్‌లైన్ వేధింపులు, తప్పుడు వార్తలు, ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సోషల్ మీడియా, సైబర్ క్రైంలో నమోదవుతున్న ఫిర్యాదులు తదితర అంశాలపై సైబర్‌క్రైం సీఐ హేమంత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కోసం నిరీక్షణ..!

ముందుకు కదలని నీటి పథకం పనులు
టీడీపీ హయాంలో ప్రారంభం..
20శాతం పూర్తి
ఆ తర్వాత అటకెక్కిన వైనం

పుట్టపర్తి, ఏప్రిల్ 3: పుట్టపర్తి ప్రజలకు నీటి కోసం నిరీక్షణ తప్పలేదు. నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి టీడీపీ హయాంలో ప్రారంభించిన పథకాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక అటకెక్కించింది. టీడీపీ హయాంలో రూ.100.38 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ సంస్థ పనులను సైతం ప్రారంభించింది. ఎన్నికల తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో 20 శాతంలోగా పనులు పూర్తయిన వాటన్నింటినీ నిలుపుదల చేసింది. ఆ తర్వాత ఆ కంపెనీనే పనులను తిరిగి ప్రారంభించింది. ఐదేళ్లలో 20 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది.

ఏఐఐబీ నిధులతో పనులు

ఆసియా ఇన్‌ఫ్రాక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) తాగునీటి ప్రాజెక్టు కోసం రూ.100.38 కోట్లు మంజూరు చేసింది. నాటి టీడీపీ ప్రభుత్వం పుట్టపర్తి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రాబోయే 30 సంవత్సరాల్లో పుట్టపర్తిలో పెరిగే జనాభాను అంచనా వేసి అందుకు అవసరమైన నీటి సరఫరా నిమిత్తం ప్రాజెక్టు రూపకల్పన చేశారు. దానికి అనుగుణంగా నిధులు మంజూరయ్యాయి.

ప్రాజెక్టులో పనులు

కొత్తచెరువు వద్ద చెరువులో ఇన్‌టెక్‌వెల్, పవర్‌స్టేషన్ వద్ద 90లక్షల లీటర్ల నీటి శుద్ధి ప్లాంటు, బీడుపల్లి పంపుహౌస్, ప్రశాంతిగ్రామ్, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి ఓవర్ హెడ్ ట్యాంకులు, కర్ణాటక నాగేపల్లి, ఎద్దులకొండ, బీడుపల్లి వద్ద జీఎల్‌ఎస్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది.

90 లక్షల లీటర్ల సామర్థ్యంతో..

రోజుకు 90 లక్షల లీటర్ల నీటిని శుద్ధిచేసే విధంగా తాగునీటి ప్లాంటు పనులు ప్రారంభించారు. ఇవి పూర్తయితే రోజుకు 90లక్షల లీటర్ల శుద్ధజలాన్ని పట్టణ ప్రజలకు అందించే అవకాశం ఉంది.

20 శాతం పనులే..

తాగునీటి ప్రాజెక్టు పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో 20 శాతం మాత్రమే పనులు


నిర్మాణ దశలోనే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు


నీట మునిగిన వాటర్‌ప్లాంటు

పూర్తయినట్లు క్షేత్రస్థాయి సిబ్బంది పేర్కొన్నారు. పవర్ స్టేషన్ వెనుక నిర్మాణంలో ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులు పునాది దశలోనే ఉన్నాయి. కొత్తచెరువు నాగులకనుమ వద్ద చెరువులో చేపట్టిన ఇంటెక్‌వెల్‌లో చెరువు నీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి. శుద్ధిజలకేంద్రం పునాదుల స్థాయిలో ఉంది. ఎద్దులకొండ మీద వాటర్‌ట్యాంకు, ఎనుమలపల్లి కొండ మీద ఓవర్ హెడ్ ట్యాంకు పనులు పునాది దశలోనే ఉన్నాయి. మిగిలిన చోట్ల సైతం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పూర్తికాని పైప్‌లైన్ పనులు

కొత్తచెరువు చెరువు నుంచి వాటర్‌ట్రీట్‌మెంట్‌ప్లాంటుకు, అక్కడి నుంచి పంపుహౌస్ ద్వారా ట్యాంకులకు 25కి.మీ. మేర పైప్‌లైన్ వేయాల్సి ఉంది. పైపులు సిద్ధంగా ఉన్నా పనులు అక్కడక్కడ పైపులైన్లు వేసి వదిలేశారు. పుట్టపర్తిలో కొన్ని వార్డుల్లో పైపులైన్లు వేశారు. ప్రధాన శుద్ధిజలకేంద్రం నుంచి వాటర్‌ట్యాంకులకు అవసరమైన పైపులైన్ పనులు పూర్తి కాలేదు.

రెండో ప్యాకేజీ పనులు ఎప్పుడో?

మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో చెరువు నుంచి నీరు పంపింగ్, శుద్ధి చేయడం, వాటిని ట్యాంకులకు పైప్‌లైన్‌ద్వారా సరఫరా చేయడం, రెండో దశలో ట్యాంకుల నుంచి మున్సిపాలిటీ పరిధిలో గృహాలకు పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకోసం మున్సిపాలిటీ పరిధిలో 57 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేయాల్సి ఉంది. పనులు ప్రారంభించిన దాఖలాలు కన్పించడం లేదు.

తప్పని ఎదురుచూపులు

ఇంటింటికీ కొళాయి ద్వారా శుద్ధిజలం సరఫరా నిమిత్తం చేపట్టిన ప్రాజెక్టు ఎప్పుడుపూర్తవుతుందో తెలియట్లేదు. ఇంటికే స్వచ్ఛజలం కోసం ప్రజలకు ఎదురుచుపులు తప్పట్లేదు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు మొదలు పెట్టి మూడేళ్లు దాటింది. మరో ఏడాదైనా పూర్తవుతుందా, కాదా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు చేపట్టిన కంపెనీకి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులను ఆపివేసినట్లు తెలుస్తోంది. చేసిన పనులకు సైతం బిల్లులు ఇవ్వలేదని సమాచారం.

బిల్లులు కాలేదని పనులు చేయలేదు

వాటర్ ప్రాజెక్టుకు సంబంధించి 20శాతం పనులు చేశారు. వీటికి సంబంధించి 5 శాతంమాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. బిల్లుల పెండింగ్‌తో పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. దీనిపై నోటీసులు సైతం అందజేశాం. అయినా కాంట్రాక్టర్ నుంచి స్పందన లేదు.
- నరసింహమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ

ఉష్ణోగ్రతలు (బుధ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	25.0
కదిరి	39.0	24.0
ధర్మవరం	41.0	26.0
హిందూపురం	38.0	23.0
పెనుకొండ	39.0	24.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 గురువారం (సాయంత్రం)	4.51 శుక్రవారం (ఉదయం)
కదిరి	6.32 గురువారం (సాయంత్రం)	4.57 శుక్రవారం (ఉదయం)
ధర్మవరం	6.37 గురువారం (సాయంత్రం)	4.54 శుక్రవారం (ఉదయం)
హిందూపురం	6.35 గురువారం (సాయంత్రం)	4.58 శుక్రవారం (ఉదయం)
పెనుకొండ	6.34 గురువారం (సాయంత్రం)	4.55 శుక్రవారం (ఉదయం)


సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

శిక్షణ రోజును ఆన్‌డ్యూటీగా పరిగణించాలి: యూటీఎఫ్

పెనుకొండ, ఏప్రిల్ 3: ఎన్నికల విధుల్లో భాగంగా పీఓ, ఏపీఓలుగా నియమితులైన ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యే రోజును ఆన్‌డ్యూటీగా పరిగణించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్.. బుధవారం సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌ను స్థానిక ఆయన కార్యాలయంలో కలిశారు. ఉపాధ్యాయ నేతలు మాట్లాడుతూ.. పీఓ, ఏపీఓ శిక్షణకు హాజరయ్యే రోజును కంపెన్సేటివ్ సెలవుగా పరిగణించరాదన్నారు. ఇది ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. కంపెన్సేటివ్ సెలవును ఎత్తివేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సబ్ కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, నారాయణస్వామి, గంగాధర్, శేషాద్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 3: జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లాకేంద్రం పరిధి మంగళకర కళాశాలలో బుధవారం పుట్టపర్తి అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. తొలి విడత శిక్షణకు 400 మంది హాజరయ్యారు. అంతకుముందు పీఓలు, ఏపీఓలు ఈవీఎంలపై డెమో ద్వారా మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

30,233 జవాబు పత్రాల మూల్యాంకనం

కొత్తచెరువు, ఏప్రిల్ 3: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. బుధవారం 30,233 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి (డీఈఓ) తెలిపారు.



టీడీపీలో చేరినవారితో కందికుంట వెంకటప్రసాద్

వంద గిరిజన కుటుంబాలు టీడీపీలోకి చేరిక

తనకల్లు, ఏప్రిల్ 3: మండలంలోని మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, దేవళంతండా, భీమ్లానాయక్‌తండా, బాబేనాయక్‌తండా, నడిమితండా, గుట్టమీద తండా, రామప్పకుంట తండాకు చెందిన సుమారు వంద గిరిజన కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కదిరిలోని కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో బుధవారం వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాగభూషన్‌నాయక్, రమణనాయక్, బాలాజీనాయక్, సర్పంచ్ కాంతమ్మ, శ్రీరాములనాయక్ ఆధ్వర్యంలో వారంతా టీడీపీలోకి చేరారు. కందికుంట మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కూటమి విజయం కోసం సైనికుల్లా పని చేయాలని కోరారు. అందరినీ తమ కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బీగం శంకర్‌నాయుడు, బాగేపల్లి చలపతి, శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్, ఆనంద్‌రెడ్డి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కందికుంట ఎన్నికల ప్రచారం

కదిరి: తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి పంచాయతీలోని పూలవాండ్లపల్లి, వేమలగొంది, కొట్టాల, మైరాడ, ఎం. వడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ఆయనకు అడుగడుగునా ప్రజలు ఘనస్వాగతం పలికారు. కందికుంట ఇంటింటా తిరిగి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల గురించి తెలియజేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భైరవప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీవి నీచ రాజకీయాలు

కదిరి, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్ల పంపిణీపై వైసీపీ నీచరాజకీయాలకు పాల్పడుతోందని, ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తోందని కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో అనేక కుట్రలకు తెరలేపిందన్నారు. దీన్ని గ్రహించిన ఎన్నికల కమిషన్ వలంటీర్లను పింఛన్ల పంపిణీ విధులకు దూరం పెట్టిందన్నారు. అయితే దీన్ని సాకుగా తీసుకుని వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ప్రతిపక్షాలు ఇంటింటి పంపిణీని అడ్డుకుంటున్నట్లు ప్రచారం చేస్తోందన్నారు. తాము ఇంటింటి పంపిణీకి వ్యతిరేకం కాదన్నారు. సచివాలయ సిబ్బంది వందల సంఖ్యలో ఉన్నారని, వారితో ఎందుకు పంపిణీ చేయించలేదని ప్రశ్నించారు. పాలక పక్షం కుట్రతోనే ఇది జరుగుతోందన్నారు. వీటిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తే మొదటి నెల నుంచే రూ.నాలుగువేలు ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే కదిరి నియోజవర్గానికి వైసీపీ అభ్యర్థిగా బెంగళూరుకు చెందిన వ్యక్తిని, హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బళ్లారికి చెందినవారిని తీసుకొచ్చి కదిరిపై పెత్తనం చెలాయించాలని చూస్తే నియోజకవర్గ ప్రజలు సహించరన్నారు. వారి అహంకారాన్ని తిప్పి కొడతామన్నారు. కార్యక్రమంలో కూటమినాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భైరవప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో అల్లనేరేడు, మామిడి చెట్లు దగ్ధం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని ఇనగలూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మనోహర్‌నాయుడుకు చెందిన తోటలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి అల్లనేరేడు, మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రెండు ఎకరాల పొలంలో గత నాలుగు సంవత్సరాలుగా అల్లనేరేడు, మామిడి చెట్లు పెంచామని, అయితే బుధవారం ఉదయం ఇసుకను తరలించే కొంతమంది తోటకు సమీపంలోని గుబురుగా ఉన్న చెట్లకు నిప్పు పెట్టారని, నిప్పురవ్వలు తోటలోకి వ్యాపించి ప్రమాదం జరిగిందని బాధితుడు వాపోయాడు. దాదాపు రెండువందల చెట్లు కాలిపోయాయన్నారు. రూ.5లక్షలు నష్టం జరిగిందన్నారు. తాను, స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం: పల్లె



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న పల్లె

ఓబుళ దేవర చెరువు, ఏప్రిల్ 3: మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పాత మసీదు వద్ద బుధవారం రాత్రి ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ంలో టీడీపీ ప్రభుత్వం మైనార్టీలకు ఎన్నో సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని గుర్తు చేశారు. అదే వైసీపీ వచ్చాక ఆ పథకాలన్నింటినీ రద్దు చేసిందన్నారు. ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసుకుందామని, అందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, మైనార్టీ నాయకులు మండోజీ ఆర్ఫిఖాన్, తుమ్మల మహబూబ్‌బాషా, నిజాం, అంగడి బాషు, చికెన్ షానూ, గండికోట ఇర్షాద్, ఆర్‌ఎంపీ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

తన పైపులు మరొకరికి ఇచ్చారని ఫిర్యాదు

కొత్తచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన నారాయణ స్వామి తన భార్య ఈశ్వరమ్మపేరిట వచ్చిన పైపులను ఓ స్వచ్ఛందసంస్థకు చెందిన గంగిరెడ్డి మరొక రైతుకు ఇచ్చాడని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014వ సంవత్సరంలో వాటర్ క్యారింగ్ పథకం కింద రెండున్నర ఇంచుల 60పైపులకు గాను రూ.6వేలు డీడీ డబ్బులు గంగిరెడ్డికి ఇచ్చానని, అయితే దాదాపు 10 ఏళ్ల తరువాత ఇప్పుడు పైపులు వస్తే వాటిని పోతులకుంటకు చెందిన విశ్వనాథరెడ్డికి ఇచ్చారని బాధిత రైతు ఫిర్యాదులో వాపోయారు. అదేవిధంగా ఇరగంపల్లి గ్రామానికి చెందిన అరుణమ్మ, ఎస్ నారమ్మ మూడించుల పైపులకు ఒక్కొక్కరు రూ.7వేలు చొప్పున డబ్బులు చెల్లించారని, వారికి కూడా పైపులు ఇవ్వకుండా మరొకరికి ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని గంగిరెడ్డిని అడిగితే సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నాడని తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆ రైతు పేర్కొన్నారు.

రాజమండ్రి కో ఆర్డినేటర్‌గా బాబ్‌జాన్

నంబులపూలకుంట, ఏప్రిల్ 3: రాజమండ్రి పార్లమెంటు ఎన్నికల కోఆర్డినేటర్‌గా మండలానికి చెందిన మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్‌జాన్ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలిపారు. ఇందుకు గాను మండలంలోని గూటిబైలు గ్రామస్థులు మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయనకు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏపీడీ

తాడిమర్రి, ఏప్రిల్ 3: మండలంలోని నిడిగల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ మణిమంజరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడుతూ.. ఉదయం 10:30 గంటలలోగా ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఉదయం 5:30 నుంచి 10:30గంటల వరకు పనులు చేయాలని తెలిపారు. పని ప్రదేశాలలో నీడ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

- చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి
- టీడీపీలోకి 45 కుటుంబాల చేరిక



టీడీపీలోకి చేరిన వారితో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, ఏప్రిల్ 3: ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని హిందూపురం ఎంపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారధి మండిపడ్డారు. మండలంలోని ఎర్రపల్లి గ్రామంలో బుధవారం ఆయనతో పాటు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో స్థానికులైన కురుబ, వడ్డెర, బలిజ, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన 45 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వీరికి పార్థసారధి, పల్లెసింధూర, పల్లె రఘునాథ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీకే పార్థసారధి మాట్లాడుతూ.. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారన్నారు. ఒక్క రాజధానిని కూడా కట్టలేని సీఎం మూడు రాజధానులను ఎలా కడతారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను దగా చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే మళ్లీ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులను ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. అనంతరం పల్లె సింధూర, పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయన్నారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదన్నారు. వైసీపీ కండువాలు వేసుకున్న వారికి మాత్రమే వ్యతిరేకమన్నారు. చంద్రబాబు సీఎం అయినా.. వలంటీర్, సచివాలయ వ్యవస్థను కొనసాగిస్తారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం



పడమరనడింపల్లిలో ఉపాధి కూలీలకు పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు



చిప్పలమడుగులో సూపర్‌సిక్స్ కరపత్రాలు అందచేస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఏప్రిల్ 3: మండలంలోని పడమరనడింపల్లిలో బుధవారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్‌పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే ఈ పథకాలన్నీ అమలవుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. తర్వాత ఉపాధి కూలీల వద్దకు వెళ్లి పథకాల వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కందికుంట వెంకటప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయతీ బొగ్గలపల్లి గ్రామంలో టీడీపీ మండలకన్వీనర్ మైలే శివశంకర్ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి పథకాల గురించి ప్రజలకు కరత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. బడుగులు అభివృద్ధిలోకి రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సింధూరారెడ్డిని, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు వెంకటరమణనాయుడు, ఆంజనేయులు నాయుడు, బాలాజీ, మోపూరి రవి, శంకర్, రామచంద్ర, రామప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని చిప్పలమడుగు గ్రామంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పథకాల వల్ల కలిగే లభాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, తెలుగుయువత హరి, శీనా, నర్సిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం'



సదస్సులో పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు

నల్లచెరువు, ఏప్రిల్ 3: చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని పలువురు బీసీ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గీతామందిరంలో జయహో బీసీ సదస్సు జరిగింది. టీడీపీ మండలకన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మండలంలో ఈనెల 12నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. పి.కొత్తపల్లి నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు నాగభూషణంనాయుడు, బషీర్ అహమ్మద్, అశ్వర్థనాయుడు, కిరణ్, ప్రసాద్, వెంకటరమణ, సతీష్, వీర, జయరామిరెడ్డి, వెంకటరమణ, నాగిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వంకరకుంటలో పల్లె సింధూర ప్రచారం

నల్లమాడ, ఏప్రిల్ 3: మండలంలోని వంకరకుంటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచారానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

నంబులపూలకుంట, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమాలో ఉపాధ్యాయుల నెలవారీ ప్రీమియంలు జీతాల నుంచి చెల్లింపులు జరుగుతున్నా బీమాకు మాత్రం జమ కావడం లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో బుధవారం ఆయన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ప్రీమియం సుమారు పది నుంచి 20నెలల పాటు జమ కాలేదన్నారు. క్రమబద్ధీకరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజులు, రమణానాయక్, మురళీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

నల్లమాడ, ఏప్రిల్ 3: మండల వ్యాప్తంగా దళిత, గిరిజన తండాల్లో ఉపాధి పనులు కల్పించాలని కదిరి డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్‌నాయక్ బుధవారంప్రకటనలో కోరారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేక వలసలు వెళ్తున్నారని, వాటిని నివారించడానికి ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు నీడ, నీరు, ప్రథమచికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

నల్లచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామ పరిధిలో నల్లజోడువారిపల్లి చెరువునుంచి మట్టి అక్రమంగా తరలిపోతోందని గ్రామస్థులు బుధవారం పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నల్లజోడువారిపల్లి చెరువు నుంచి మట్టిని తరలించడానికి పంచాయతీ కార్యదర్శి డబ్బులు వసూలు చేసి, సహకరిస్తున్నట్లు చెప్పారు. ఇలా చేయరాదని పలుమార్లు తెలిపినా, పట్టించుకోలేదన్నారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహదేవరెడ్డి, శ్రీనివాసులు, శ్రీరాములు, గంగాధర ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని గాజుకుంటపల్లి వద్ద బుధవారం ఎస్ఐ వంశీకృష్ణ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎన్నికల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ముదిగుబ్బ, ఏప్రిల్ 3: మండల కేంద్రంలోని పాతూరికి చెందిన టీడీపీ కార్యకర్త గోనుగుంట్ల మల్లికార్జున (65) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గోనుగుంట్ల మల్లికార్జున బుధవారం వ్యవసాయ పొలంలో వేరుశనగ నూర్పిడి యంత్రం వద్ద పని చేస్తుండగా గుండెపోటు వచ్చిందని, దీంతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడని చెప్పారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

వృద్ధురాలి మృతికి పల్లె నివాళి

బుక్కపట్నం, ఏప్రిల్3: మండలకేంద్రంలోని బీసీకాలనీలో వృద్ధురాలు జంపాల చెన్నమ్మ(75) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెలుగుమహిళ అధ్యక్షురాలు లావణ్యగౌడ్, టీడీపీ నాయకులు జంగం వెంకటరాముడు, సుబ్బారెడ్డి, దేశెట్టిరామాంజి ఉన్నారు.

ఇంటివద్దే పింఛన్ ఇవ్వండి

ధర్మవరం, ఏప్రిల్ 3: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వృద్ధులకు, వికలాంగులకు పింఛన్‌లను ఇంటి వద్దనే పంపిణీ చేయాలని బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వలంటీర్లను ఈసీ దూరం పెట్టిందని, కావున ప్రభుత్వ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దే పంపిణీ చేయాలని కోరారు.

బీఎస్ఎఫ్ ఐజీకి ఘన స్వాగతం



శ్రీకైలాసచంద్రజాట్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 3: కేంద్రసాయిధ బలగాలైన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ఐజీ కైలాసచంద్ర జాట్‌కు జిల్లా ఎస్పీ ఘనస్వాగతం పలికారు. సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకునేందుకు గాను బుధవారం సాయంత్రం ఐజీ పుట్టపర్తికి వచ్చారు. ఆయనకు ప్రశాంతి నిలయం శాంతిభవన్ వద్ద ఘనస్వాగతం లభించింది. ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఎస్పీతో పాటు ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్ ఉన్నారు.

ఈ ఐదేళ్లలో..

ధర్మవరాన్ని భ్రష్టు పట్టించారు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పంచభూతాల్ని కూడా కబ్జా చేస్తున్నారు
- అతడి నుంచి ధర్మవరాన్ని రక్షించుకుందాం
- విలేకరుల సమావేశంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్
- బీసీ అభ్యర్థిని గెలిపించుకుందామంటూ పరిటాలశ్రీరామ్ పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్, పక్కన పరిటాలశ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 3: ఎంతో ప్రశాంతంగా ఉండే ధర్మవరాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భ్రష్టు పట్టించారని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. అనంతపురంలోని పరిటాల శ్రీరామ్ స్వగృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తాను బీజేపీ జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు పని చేశానన్నారు. తొలి సారి ప్రత్యక్ష ఎన్నికలలో ధర్మవరం నుంచి పోటీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ధర్మవరం నియోజకవర్గం గురించి పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. పరిటాల శ్రీరామ్, ఇతర నాయకుల సహకారంతో ఇక్కడ ఖచ్చితంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక,మట్టి దోపిడీ జరుగుతుంటే.. ఇక్కడ మాత్రం పంచభూతాల దోపిడీ జరిగిందన్నారు. ఒక చెరువును కబ్జా చేసి విలాసవంతమైన భవనం నిర్మించుకుని రైతుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. ఇక్కడి ప్రజలను పట్టి పీడిస్తున్న పాలకులను పారద్రోలుదామని పిలుపునిచ్చారు. తర్వాత పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గంలో తొలిసారిగా ఒక బీసీ అభ్యర్థి పోటీ చేస్తున్నారని, అయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని అంశాలగురించి ఆయన తెలుసుకున్నారన్నారు. ఒక జాతీయ నాయకుడు ధర్మవరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. గురువారం సత్యకుమార్ ధర్మవరానికి వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నేడు ధర్మవరానికి సత్యకుమార్ రాక

ధర్మవరం, ఏప్రిల్ 3: ధర్మవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గురువారం ధర్మవరానికి రానున్నారని టీడీపీ శ్రేణులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు ఘన స్వాగతం పలకడానికి టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ రానున్నారన్నారు. గురువారం ఉదయం 9గంటలకు బత్తలపల్లి మండలం ఎర్రాయపల్లి వద్ద స్వాగతం పలికి అక్కడి నుంచి భారీ ర్యాలీతో ధర్మవరానికి రానున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఎన్టీఆర్ సర్కిల్లో బహిరంగ సభ ఉంటుందన్నారు. టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్, పరిటాల అభిమానులు, టీడీపీ అనుబంధ సభ్యులు, తెలుగు యువత నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సత్యకుమార్ పర్యటనను విజయవంతం చేయండి

ముదిగుబ్బ/బత్తలపల్లి: ధర్మవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి సత్యకుమార్ గురువారం ధర్మవరం రానున్నారని, ఆయన పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ ముదిగుబ్బమండల కన్వీనర్ కరణంప్రభాకర్, బత్తలపల్లి నాయకులు సురేంద్ర, చితంబరరెడ్డి, రవి, నారాయణస్వామి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బత్తలపల్లి మండలం ఎర్రాయపల్లి గ్రామం వద్దకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ధర్మవరం వెళ్లి అక్కడ జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు.

జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి



క్షేత్ర సహాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని, అలా పనులు కల్పించని క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎవరూ పనులు లేవని వలస వెళ్లకూడదన్నారు. ప్రతిఒక్క కూలీకి పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రోజుకు ఆరువేల మంది కూలీలు తగ్గకుం డా పనులు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ సుధాకర్, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, హనుమంతురెడ్డి, చంద్రారెడ్డి, రాజేంద్రయాదవ్, ఈసీ అంజనేయులు క్షేత్రసాయి సిబ్బంది తదితరులున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఎస్పీ ఘన సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 3: రిటైర్డ్ అయిన ఎస్పీ ఎస్ఐ కుళ్లాయిస్వామి, ఏఆర్ఎస్ఐలు సుబ్బారెడ్డి, కృష్ణకుమార్, ఎస్ఐ ఇస్మాయిల్‌కు జిల్లాకేంద్రంలోని పోలీసుకార్యాలయంలో బుధవారం ఘన సన్మానం జరిగింది. ఎస్పీ మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి.. ఎక్కడా రాజీపడకుండా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. శేషజీవితం ఆనందగంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, సైబర్‌క్రైం సీఐ హేమంత్‌కుమార్, ఆర్ఐలు రవికుమార్, వలి, ఏఎస్ఐలు శ్రీరాములు, అమీర్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పుట్టపర్తి, ఏప్రిల్ 3: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సాయిమా రెస్టారెంట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరందిస్తానంటూ ఎన్నికల ముందు జిమ్మిక్కులు చేశారని విమర్శించారు. ఆయన ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. రైతురాజ్యం రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ ప్రెసిడెంట్ కోటా సత్యం, మండల కన్వీనర్లు పుట్ల గంగాధర్, పఠాన్ గౌస్‌బాషా, శ్రీధర్,వాసుదేవరెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరువు కాటు..!

బోరుబావుల్లో పడిపోయిన నీటిమట్టం

- పంటకు నీరివ్వలేకపోతున్న రైతులు
- నిలువునా ఎండుతున్న చీనీచెట్లు
- చేసేదిలేక కొట్టేస్తున్న వైనం
- అన్నదాతకు అప్పుల పంట

చీనీ చెట్లను బతికించుకోవడం కష్టంగా ఉంది



మా తోటలో చీనీచెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. 400 చెట్లు ఉండగా ఇప్పటికే 60 చనిపోయాయి. ఇంకో నెలరోజులు పోతే ఎండ తీవ్రత, తెగుళ్ల బెడదకు ఎన్ని చెట్లు చనిపోతాయోనని భయంగా ఉంది.

- రామచంద్రారెడ్డి, రైతు





తొలగించిన చీనీ చెట్లు

చీనీ పంటను కరువు కాటేస్తోంది. తీవ్ర వర్షాభావంతో బోరుబావుల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. పంటకు తడులివ్వలేని దుస్థితి దాపురించింది. దీంతో చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. లక్షల పెట్టుబడులు పోసి కాపాడుకున్న చెట్లు ఎండిపోతుంటే అన్నదాత కంటతడి పెడుతున్నాడు. వాటిని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేసినా ఫలించలేదు. చేసేదిలేక పెంచుకున్న చెట్లను నిలువునా నరికేస్తున్నాడు. అప్పులు మూటగట్టుకుంటున్నాడు. చెట్లు పెద్దవయ్యాయి, ఇక పంట పెట్టుకోవచ్చనీ, వచ్చిన దిగుబడిని విక్రయించి, అప్పులు తీర్చుకోవచ్చని ఆశపడిన చీనీ రైతుకు నిరాశే ఎదురవుతోంది. వేసవి ప్రారంభంలో ఒకవైపు నీటి ఎద్దడి.. మరోవైపు తెగుళ్ల దాడితో చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. రైతులు ఎన్ని రకాల మందులు ఉపయోగించినా తెగుళ్లు అదుపులోకి రావడంలేదు. దీంతో చెట్లను తొలగించుకోవడమే శరణ్యమని రైతులు తొలగించే పనికి పూనుకుంటున్నారు. - తాడిమర్రి



ఎండిన చీనీచెట్టు

నీరులేక 500 చెట్లు కొట్టేశా

ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. బోరుబావిలో నీటిమట్టం పడిపోయింది. చీనీ పంటకు తడులిచ్చుకునేందుకు కూడా నీరు చాలట్లేదు. దీంతో చెట్లు ఎండిపోయాయి. చేసేదిలేక 500 చెట్లను తొలగించా. పంట చేతికొచ్చే సమయంలో 8 సంవత్సరాల వయసుగల చెట్లను కొట్టేయడంతో రూ.6 లక్షల వరకు నష్టపోయా.

- పక్కీర్‌రెడ్డి, రైతు, శివంపల్లి



అప్పుడలా.. ఇప్పుడిలా..

తాడిమర్రి మండలంలో వందల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. 2022లో వరుస భారీ వర్షాలు కురిశాయి. పీఏబీఆర్ కుడికాలువకు నీరు సమృద్ధిగా వదిలారు. దాదాపు మండలంలోని చెరువులన్నింటికీ నీరు చేరింది. 2023లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు పండ్లతోటలకు నీరు అవసరానికి మించి పెట్టుకున్నారు. అదే ఇప్పుడు వారికి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. గత 8 నెలల్లో వాన జాడలేకపోవడం, పీఏబీఆర్ కుడి కాలువకు నీరు రాకపోవడంతో బోరుబావుల్లో భూగర్భజల మట్టాలు దారుణంగా పడిపోయాయి. దీంతో రైతులు.. పంటలకు అవసరమైన నీరు అందించలేకపోతున్నారు. గడచిన రెండేళ్లలో పంటలకు నీరు అధికంగా పెట్టడం, ఈసారి అరకొరగా ఇవ్వడంతో చీనీ చెట్లు దెబ్బతింటున్నాయి. ఎండిపోతున్నాయి. పక్క రైతుల నుంచి నీరు తీసుకునే అవకాశం కూడా లేదు. దీంతో చేసేదిలేక చీనీ చెట్లను తొలగిస్తున్నారు. పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో చెట్లు కొట్టేసుకోవాల్సి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నిలకడగా చింతపండు ధరలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3: పట్టణంలోని మార్కెట్‌యార్డులో చింతపండు ధరలు నిలకడగా ఉన్నట్లు మార్కెట్‌యార్డు కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్, రాయదుర్గం ప్రాంతాల నుంచి చింతపండును మార్కెట్‌యార్డుకు తరలించారు. చపాతిరకం క్వింటాల్ రూ. 4500 నుంచి రూ. 7700 వరకు ధర పలకగా, కరిపులి రకం రూ. 10,200 నుంచి రూ. 15వేల వరకు పలికినట్లు తెలిపారు. మార్కెట్‌యార్డులో సేకరించిన చింతపండును హిందూపురం, గుంటూరు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

అనంతపురం మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 3: ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి ముజఫ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ మధ్య (వయా అనంతపురం) వన్‌వే సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును (నెం. 05269) నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ముజఫ్ఫర్‌నగర్‌లో 4వ తేదీ మధ్యాహ్నం మూడున్నరకు బయలుదేరి 6వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు హాజీపూర్, పాటలీపుత్ర, బక్సర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, ప్రయాగంరాజ్ చౌకీ, మాణిక్‌పూర్, సట్నా, కట్ని, జబల్‌పూర్, నర్సింగ్‌పూర్, పిప్రియా, ఇటార్సి, నాగపూర్, బాలార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగుండం, ఖాజీపేట్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించి బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. జనవరి, ఫిబ్రవరిలో బీటెక్ ప్రథమ సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్ 23) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. అదేవిధంగా ప్రథమ, ద్వితీయ సెమిస్టర్స్ (ఆర్ 20, 21, 15) సప్లమెంటరీతో పాటు (ఆర్ 15) సప్లమెంటరీ లాస్ట్‌ఛాన్స్ పరీక్షలనూ నిర్వహించామన్నారు. మరోవైపు ఎంఫార్మసీ ప్రథమ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్ 17) సప్లమెంటరీ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 21, 17) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పీఈటీ కొట్టినందుకు అవమానంగా భావించిన విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఓ బాలిక కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. స్నాక్స్, చిల్లర డబ్బులు కాజేస్తోందని గత నెల 24న సహ విద్యార్థినులు ఆమెపై పీఈటీ అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విద్యార్థినిని పీఈటీ కొట్టి, మందలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తండ్రి బుధవారం ఉదయం కేజీబీవీకి వెళ్లి, ఇన్‌చార్జి ఎస్‌ఓ కాంచన గంగకు ఫిర్యాదు చేశారు. పిల్లలు తప్పు చేస్తే మందలించాలని, కొడితే ఎలా అని ప్రశ్నించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదిలో చున్నీతో ఉరివేసుకునేందుకు ప్రయత్నిస్తూ, విద్యార్థిని కిందపడి కేకలు వేసింది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మహేశ్వరి, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినిని పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పీఈటీ అనితను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నామని కేజీబీవీ జిల్లా కార్యదర్శి తెలిపారు. కేజీబీవీకి వెళ్లి విచారించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌ను దుర్భాషలాడిన వ్యక్తికి జైలుశిక్ష

బుక్కపట్నం, ఏప్రిల్ 3: మండలకేంద్రంలోని భారతీయస్టేట్ బ్యాంకు మేనేజర్‌ను అసభ్యపదజాలంతో దుర్భాషలాడిన కేసులో మండలంలోని గూనిపల్లికి చెందిన కేశవరెడ్డికి ఆరునెలలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. స్టేట్‌బ్యాంకు మేనేజర్ శ్రీహరికుమార్‌పై 2012 సెప్టెంబరు నెలలో క్రాప్‌లోన్ నిమిత్తం రైతు కేశవరెడ్డి బ్యాంకులో మేనేజర్‌ను ఛాంబర్‌లోకి వెళ్లి అసభ్యపదజాలంతో దూషించాడు. ఇందుకు బ్యాంకు మేనేజర్ సదరు వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పుట్టపర్తి న్యాయాధికారి రాకేష్ ఐదుగురు సాక్షులను విచారించారు. తర్వాత పబ్లిక్‌ప్రాసిక్యూటర్ నగేష్ వాదనలతో ఏకీభవించి కేశవరెడ్డికి బుధవారం ఆరునెలలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత మృతి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 3: మండలంలోని భీమునిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కొక్కిరాయి కొండలో బుధవారం అనారోగ్యంతో చిరుత మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పశువైద్యాధికారిణి కమల మృతిచెందిన చిరుతకు పంచనామా నిర్వహించారు. అనారోగ్యంతోనే చిరుత మృతి చెందిందని ధ్రువీకరించారు. నిబంధనల మేరకు చిరుతను ఖననం చేశారు.



మృతిచెందిన చిరుత

చెలగాటం..!

డీఎస్సీ అభ్యర్థులతో వైసీపీ ప్రభుత్వం ఆటలు
పరీక్షాకేంద్రాల ఎంపికకు ప్రారంభంకాని వెబ్‌సైట్ ఆప్షన్
డౌన్‌లోడ్ కాని హాల్‌టిక్కెట్లు
ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న అభ్యర్థులు

ధర్మవరం, ఏప్రిల్ 3: డీఎస్సీ అభ్యర్థులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ప్రభుత్వ కొలువు సాధించాలన్న తపనతో డీఎస్సీ అభ్యర్థులు రాత్రింబవళ్లు చదివి టెట్ (టీచర్స్ ఎంట్రెన్స్ టెస్టు) సైతం రాసి డీఎస్సీకి అర్హత సాధించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటివరకు సరైన సమాచారం తెలపకపోవడంతో అభ్యర్థులు మండిపడుతున్నారు. మరికొంత మంది అభ్యర్థులు తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శిస్తున్నారు. గతనెల 25వతేదీ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. ఇంతవరకు ఆ వెబ్‌సైట్ ఆప్షన్ ఇవ్వలేదు. పరీక్షా కేంద్రాల ఎంపికకు కూడా ఇదే సమస్య నెలకొంది. దీంతో టీఎస్సీ అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఇవ్వని డీఎస్సీని ఎన్నికల ముందు తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. తీరా ఎన్నికల కోడ్ అమలవుతుందన్న సమయంలో హడావుడిగా టెట్ నిర్వహించింది. డీఎస్సీ నిర్వహణపై ప్రకటన చేయకముందే ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో అభ్యర్థులు డీఎస్సీ నిర్వహిస్తారా.. లేదా.. అన్న సందేహంలో కొట్టుమిట్టాడుతున్నారు.

పాపం.. అభ్యర్థులు..

బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం నోటిఫికేషన్‌లో కల్పించింది. దీంతో బీఈడీ అభ్యర్థులు రెండు పోస్టులకు కొంతమంది దరఖాస్తు చేసుకోగా.. మరికొంతమంది ఎస్జీటీ పోస్టుకే చేసుకున్నారు. బీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులకు అర్హత కల్పించడంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. ఎస్జీటీలకు అనుకూలంగా తీర్పు వెలువడింది. దీంతో ఎస్జీటీ పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్న బీఈడీ అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా తాము డీఎస్సీని కోల్పోయామని పలువురు అభ్యర్థులు.. ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎస్జీటీకి అర్హత లేని బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుచేసుకోవాలనుకున్నా.. గడువు ముగిసింది. ఎస్జీటీ పోస్టుకు చెల్లించిన దరఖాస్తు రుసుం రూ.750 బీఈడీ అభ్యర్థులకు ప్రభుత్వం నేటికీ తిరిగి చెల్లించలేదు.

30లోగా డీఎస్సీ నిర్వహించేరా?

హైకోర్టు ఆదేశాలతో విద్యాశాఖ సవరించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగాల్సి ఉంది. ఇప్పటివరకు అభ్యర్థుల పరీక్షా కేంద్రాల ఎంపికకు వెబ్‌సైట్ ఆప్షన్ కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. మార్చి 25లోగా హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉందనిప్రభుత్వం ప్రకటన కూడా చేసింది. 25 దాటినా ఇప్పటి వరకు హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకునే ఆప్షన్ ఇప్పటివరకు విద్యాశాఖ ఇవ్వలేదు. ముందుగా పరీక్షాకేంద్రాల ఎంపిక ప్రక్రియకే వెబ్‌సైట్ ఇవ్వలేదు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వం ఎన్నికల్లో అభ్యర్థుల ఓట్లు పొందడానికే ఇలాంటి జిమ్మిక్కులు ప్రదర్శించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ జీవితాలతో ఆడుకుంటున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని డీఎస్సీ అభ్యర్థులు చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిరుద్యోగులకు దగా



నిరుద్యోగులను ప్రభుత్వం దగా చేసింది. ఎన్నికలకు ముందు ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి, ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికింది. ఐదేళ్లు విడుదల చేయలేదు కానీ తీరా ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్కువ పోస్టులతో ఇచ్చింది. అది కూడా ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేశారు. దీంతో అభ్యర్థులు అయోమయంలో పడిపోయారు.

- బాలచంద్ర, డీఎస్సీ అభ్యర్థి, ధర్మవరం

ప్రభుత్వం చెలగాటం



ఎన్నికల ముందు నోటిఫికేషన్ విడుదల చేయడంలో అంతర్యమేమిటో అంతుచిక్కట్లేదు. డీఎస్సీ నోటిఫికేషన్ వదిలేసి, ఇప్పటివరకు వారికి హాల్‌టిక్కెట్, పరీక్షాకేంద్రాల ఎంపికకు వైబ్‌సైట్ ఆప్షన్ ఇవ్వలేదు. ఇది ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసం చేయడమే.

- శివ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

సత్యకుమార్‌ను కలిసిన జయరాంనాయుడు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3: మీ కోసం మా సేవలు వ్యవస్థాపకుడు కే. జయరాంనాయుడు ధర్మవరం ఉమ్మడి కూటమి అభ్యర్థి, బీజేపీ నేత సత్య కుమార్‌ను కలిశారు. బుధవారం అనంతపురంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం జయరాం నాయుడుతో సత్యకుమార్ కొద్ది సేపు ఏకాంతంగా మాట్లాడారు. రాజకీయ పరిణామాలు, ఎన్నికలలో విజయం తదితర వాటిపై చర్చించారు.



సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయరాంనాయుడు

వైసీపీ ప్రచారంలో గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్

రాప్తాడు, ఏప్రిల్ 3: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ డొక్కా శంకర్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. మంగళవారం రాత్రి గాండ్లపర్తిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచార రథం ఎక్కి మరీ ప్రచారం చేశాడు.



ప్రచారం రథంపై ఎమ్మెల్యే పక్కన ఉన్న గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

శింగనమల, ఏప్రిల్ 3: మండలంలోని గురుగుంట్లలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆకులేడు ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి.. అతన్ని తొలగించినట్లు ఆర్వో శ్రీను వెన్నల, ఎంపీడీవో బి. వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తమకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రచారంలో వలంటీరు

హిందూపురం, ఏప్రిల్ 3: రూరల్ మండలంలో బాలంపల్లి పంచాయతీలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రచారంలో అశ్వత్థనారాయణ అనే గ్రామ వలంటీరు పాల్గొన్నాడు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రచారం చేస్తుండగా అశ్వత్థనారాయణ నాయకులవెంట వెళ్లి ఓట్లను అభ్యర్థించినట్లు తెలిసింది.



ప్రచారంలో పాల్గొన్న వలంటీరు అశ్వత్థనారాయణ

రాజీనామా చేయాల్సిందే..!

వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్న వైసీపీ
ప్రచారంలో పాల్గొనాలని హుకుం
అధికారంలోకి వస్తే మంచి భవిష్యత్తు
అంటూ ఉచిత మాటలు
తిరస్కరిస్తున్న కొంతమంది వలంటీర్లు



పెనుకొండ మండలంలో మూకుమ్మడి రాజీనామా చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 3: పెనుకొండలో మొన్న మూకుమ్మడిగా వలంటీర్లు రాజీనామా చేశారు. నిన్న గోరంట్లలో అదేబాట పట్టారు. వీరు ముసుగు తొలగించుకుని వైసీపీ ప్రచారాల్లో పాల్గొనాలన్నదే ధ్యేయం. రాజీనామాలు ఆమోదించక ముందే వైసీపీ సేవలో తరించేందుకు సిద్ధమవుతున్నారు. సామాజిక పింఛన్లు, వలంటీర్ల ద్వారా పంపిణీ చేయద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో ఇక ఎందుకులే అని రాజీనామాలు చేస్తున్నారు. ఎక్కువచోట్ల అధికార పార్టీ నాయకులు.. వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో వందమందికి పైగా వలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

వలంటీర్లపై ఒత్తిళ్లు

సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో వారధిగా ఉన్న వలంటీర్లను ఎలాగైనా తమ పార్టీకి ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో వైసీపీ నాయకులు ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో చేసేదిలేక నాయకులు.. వలంటీర్లపై ఒత్తిడితెచ్చి రాజీనామాలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది.. వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. పరిగి మండలంలో ఓ ఎంఎల్‌ఓ.. వలంటీర్లు ప్రచారంలోకి రావాలని ఒత్తిడి చేస్తున్నాడు. రాజీనామా చేసి వస్తేనే భవిష్యత్తు ఉంటుందంటున్నారు. మరికొంతమంది వైసీపీ నాయకులు స్వార్థం కోసం వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది తిరష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. పదో తరగతి వరకు చదివిన వారిని ఒత్తిడి చేసి రాజీనామా చేయించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారు అందుకు ఒప్పుకోవట్లేదు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఉద్యోగాలు రావనీ, దీంతో ఒత్తిడి తెచ్చినా రాజీనామా చేయమంటూ డిగ్రీ, ఆపై చదివిన వారు తెగేసి చెబుతున్నట్లు సమాచారం.

కొన్నిచోట్ల ససేమిరా..

పరిగి మండలంలో ఓ వలంటీరుకు పైస్థాయి అధికారి, నాయకులు ఫోన్‌చేసి రాజీనామాకు సిద్ధపడాలన్నారు. తాను ఉన్నత విద్యావంతుడిననీ, రాజీనామా చేస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని తిరస్కరించినట్లు తెలిసింది. హిందూపురం మండలంలోని వలంటీరును వైసీపీ నాయకులు పిలిపించి, రాజీనామా చేయాలని చెప్పగా.. సున్నితంగా తిరస్కరించారు. లేపాక్షి మండలంలో ఓ వైసీపీ నాయకుడు.. వలంటీర్లను ఇంటికి పిలిపించుకుని రాజీనామా చేయాలని బెదిరించారు. అయినా వారు ససేమిరా అంటూ వెళ్లిపోయారు. పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వలంటీర్లు రాజీనామా చేయాలని నాయకులతో పాటు మండలస్థాయి అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనా వలంటీర్లతో మూకుమ్మడి రాజీనామా చేయించి, పార్టీ కోసం ఉపయోగించుకోవాలన్న పన్నాగాన్ని అధికార పార్టీ అమలు చేస్తోంది.

ప్రచారంలో పాల్గొనా లంటూ...

'రాజీనామా చేసిన ప్రతి వలంటీరు వైసీపీ ప్రచారంలో పాల్గొనాలనీ, అంతేకాక మీ పరిధిలో ఉన్న ఓటర్లు అధిక శాతం మంది వైసీపీకి ఓటువేసేలా ప్రయత్నించాలనీ, అలా ఎక్కువ ఓట్లు వేయించిన వారి వివరాలు కౌంటింగ్ రోజు తెలుస్తుందనీ, వారికి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇప్పించేందుకు ప్రయత్నిస్తామ'ని స్థానిక నాయకులు.. వలంటీర్లకు చెబుతున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందనీ, వేతనం కూడా పెరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి పనిచేయాలంటూ వలంటీర్లను రహస్యంగా పిలిపించుకుని రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కొంతమంది వలంటీర్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

నేటి నుంచి గోరంట్లలో టీడీపీ ప్రచారం

గోరంట్ల, ఏప్రిల్ 3: పెనుకొండ అసెంబ్లీ కూటమి అభ్యర్థి సవిత్మ మండలంలో గురువారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఆనవాయితీ ప్రకారం మండలంలోని ఈశాన్యంలోని గోపిదేవర పల్లిలో ఉదయం 9గంటలకు ప్రచారాన్ని ఆమె ప్రారంభించనున్నారు. గంగంపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని, కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చందకచర్ల నుంచి కాంగ్రెస్ ప్రచారం

మడకశిర రూరల్, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని మండలంలో చందకచర్ల నుంచి గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీడబ్ల్యుసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. మొదట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

నేడు జయహో బీసీ

రొళ్ల, ఏప్రిల్ 3: మండల కేంద్రంలో గురువారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎంపాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ, బీజేపీ, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న హాజరు కానున్నట్లు తెలిపారు. కావున మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పలువురికి వైకల్య నిర్ధారణ పరీక్షలు



వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మడకశిరటౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని భవిత కేంద్రం ఆవరణంలో బుధవారం వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. డాక్టర్ రాజుతో పాటు పలువురు డాక్టర్లు పాల్గొని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను పరీక్షించారు. వారి వైకల్యాన్ని బట్టి వారికి ఎలాంటి ఉపకరణాలు అవసరమవుతాయో తెలుసుకొని నిర్ధారించడానికి ఈ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా 360 మంది పిల్లలు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ఎంపీడీఓ దాసరిమేరీ, సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.

తన పైపులు మరొకరికి ఇచ్చారని ఫిర్యాదు

కొత్తచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి తన భార్య ఈశ్వరమ్మపేరిట వచ్చిన పైపులను ఓ స్వచ్ఛందసంస్థకు చెందిన గంగిరెడ్డి మరొక రైతుకు ఇచ్చాడని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014 వ సంవత్సరంలో వాటర్ క్యారింగ్ పథకం కింద రెండున్నర ఇంచుల 60పైపులకు గాను రూ.6వేలు డీడీ డబ్బులు గంగిరెడ్డికి ఇచ్చానని, అయితే దాదాపు 10 ఏళ్ల తరువాత ఇప్పుడు పైపులు వస్తే వాటిని పోతులకుంటకు చెందిన విశ్వనాథరెడ్డికి ఇచ్చారని బాధిత రైతు ఫిర్యాదులో వాపోయారు. అదేవిధంగా ఇరగంపల్లి గ్రామానికి చెందిన అరుణమ్మ, ఎస్ నారమ్మ మూడించుల పైపులకు ఒక్కొక్కరు రూ.7వేలు చొప్పున డబ్బులు చెల్లించారని, వారికి కూడా పైపులు ఇవ్వకుండా మరొకరికి ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని గంగిరెడ్డిని అడిగితే సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నాడని తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆ రైతు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గోరంట్ల, ఏప్రిల్ 3: మండలంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై నాసిన్ ప్రధాన ద్వారం వద్ద ఐషర్ వాహనం ఢీకొని గాయపడిన చత్తీష్‌గడ్ రాష్ట్రానికి చెందిన మనోహర్ (34)అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఛత్తీష్‌గడ్ రాష్ట్రంలోని డికొట్బా గ్రామానికి చెందిన మనోహర్, భార్య సునతీకన్వీర్ యేడాది కిందట కూలి పని చేయడానికి నాసిన్ పరిశ్రమలో చేరారు. అతడు నాసిన్ ప్రధాన ద్వారం వద్ద జాతీయ రహదారిని మంగళవారం రాత్రి 7గంటల సమయంలో దాటుతుండగా బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఐషర్ వాహనం ఢీకుంది. నాసిన్ కంపెనీలో పనిచేస్తున్న వారు తీవ్రంగా గాయపడిన అతడిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్సలు పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడు...

రొద్దం, ఏప్రిల్ 3 : మండలకేంద్రమైన పరిగి సమీపంలోని ధనాపురం హైవేపైన గతనెల 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన కందుకూర్లపల్లి చిన్నయ్య (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో



చిన్నయ్య (ఫైల్)

చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు బంధువులు, గ్రామస్థులు తెలిపారు. రొద్దం మండలంలోని ఆర్ మరువపల్లికి చెందిన కందుకూర్లపల్లి చిన్నయ్య కొడిగెనహళ్లిలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

బీసీలంతా ఏకమై చంద్రబాబును సీఎం చేద్దాం

జయహో బీసీలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో సవిత

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఏప్రిల్ 3 : రాష్ట్రంలోని బీసీలను అణగదొక్కిన జగన్‌ను ఇంటికి సాగనంపుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పిలుపునిచ్చారు. అలాగే బీసీలంతా మనమంతా ఏకతాటిపైకి వచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. మండలకేంద్రమైన సోమందేపల్లిలోని చౌడేశ్వరీ కల్యాణమండపంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత పంచాయతీలవారీగా సమస్యలపై ఆరాతీశారు. బీసీ కార్పొరేషన్లకు ఒక్కరూపాయి కూడా ప్రభుత్వం కేటాయించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50ఏళ్లకే పిం ఛన్ అమలు చేస్తామన్నారు. బీసీలకు ఎల్లవేళలా సముచిత స్థానం అందిస్తుందన్నారు.

పింఛన్ పంపిణీ జాప్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పెన్షన్ పంపిణీలో జాప్యానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఈ నెల 3వ తేదీ కూడా వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేక పోతుందన్నారు. పింఛన్ సొమ్మును బ్యాంకుల్లో జమచేయకపోవడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.

టీడీపీలోకి చేరిక : పెనుకొండ మండలం దుద్దేబండ పంచాతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పార్టీ స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి సవిత కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దుద్దేబండ పంచాయితి సీనియర్ వైసీపీ నాయకుడు గొల్లపల్లి బోయ రామకృష్ణతో పాటు 35 కుటుంబాలు, గుట్టూరు పంచాతీ నుంచి 15 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. గొల్లపల్లికి చెందిన రాఘవేంద్ర, డీలర్ నరసింహులు, ఆంజనేయులు పోతన్న ఫక్కీరప్ప, గంగరాజు, నాగరాజు నాగార్జున గుట్టూరు పంచాయతీకి చెందిన రామాంజనేయులు, దివాకర్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



ప్రచారంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 3: రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుక్కలు చింపిన విస్తరిలా మార్చారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, ఆ మార్పు కేవలం కూటమితోనే సాధ్యమని విశ్వసిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో దళితులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, దీనిపై సీఎం జగన్ స్పందించకపోవడం విడ్డూరం అన్నారు. మాజీ ఎంపీపీ ఆదినారాయణ, నాయకులు రామాంజనేయులు, జనసేన నాయకులు శివాజీ, టీడీపీ నాయకులు హనుమంతేగౌడ్, సురేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు రక్షణ కరవయిందని, బీసీలకు రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం మడకశిర పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి ప్రచార కార్యక్రమాన్ని పట్టణంలో నిర్వహించారు. అనంతరం పెనుకొండ రోడ్డులో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం తగ్గించడంతో అనేక మంది తమ భవిష్యత్తును కోల్పోవాల్సి వచ్చిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీలకు అన్ని విధాలా అండగా ఉంటూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. రాష్ట్ర వక్కలిగ సాధికారత కన్వీనర్ పాండురంగప్ప, మాజీ జడ్పీటీసీలు రామకృష్ణయాదవ్, నరసింహమూర్తి, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, బొజ్జప్ప, నాయకులు సురేష్, ఓబుళేశు, మాధవరాజు, ప్రకాష్, ఈశ్వర్‌సాగర్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గోరంట్ల, ఏప్రిల్ 3: మండలంలోని పుట్టగండ్లపల్లికి చెందిన వినోద్‌కుమార్ (26) ద్విచక్రవాహన ప్రమాదంలో మృతిచెందగా, ఏఎన్‌కె డిగ్రీకళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ బుధవారం బాధితకుటుంబానికి రూ.21 వేలు ఆర్థికసాయం అందించారు. మండలంలోని గుంతపల్లి గార్మెంట్సు పరిశ్రమ వద్ద ఆదివారం ద్విచక్రవాహనాలు ఢీకొని వినోద్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్ప మృతిచెందిన విషయం తెలిసిందే. వినోద్‌కుమార్ గోరంట్లలోని ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాల, ఏఎన్‌కే డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థి కావడంతో, అతడి ఆత్మశాంతికోసం బుధవారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కరస్పాండెంట్ అధ్యాపకులతో కలిసి పుట్టగుండ్లపల్లికి వెళ్లి మృతుడి భార్యకు ఆర్థికసాయం అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఎస్పీ సన్మానం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 3: రిటైర్డ్ అయిన ఎస్బీ ఎస్ఐ కుళ్లాయిస్వామి, ఏఆర్ఎస్ఐలు సుబ్బారెడ్డి, కృష్ణకుమార్, ఎస్ఐ ఇస్మాయిల్‌కు జిల్లాకేంద్రంలోని పోలీసుకార్యాలయంలో బుధవారం ఘన సన్మానం జరిగింది. ఎస్పీ మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి.. ఎక్కడా రాజీపడకుండా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. శేషజీవితం ఆనందగంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, సైబర్‌క్రైం సీఐ హేమంత్‌కుమార్, ఆర్ఐలు రవికుమార్, వలి, ఏఎస్ఐలు శ్రీరాములు, అమీర్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం పాపం ప్రభుత్వానిదే

సీపీఐ

పెనుకొండ, ఏప్రిల్ 3 : వలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయిస్తూ ప్రభుత్వం మరో కొత్త నాటకానికి నాంది పలికిందని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు మండిపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ లో జాప్యానికి ప్రభుత్వమే కారణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవా రం కూడా పింఛన్లు ఇవ్వలేకపోయిందన్నారు. దీనికి వలంటీర్ల మీద సాకులు చెప్పడం, ప్రతిపక్షాలపై బురదజల్లడం అధికార పార్టీకి అలవాటైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 1వ తేదీనే పంచాయతీ కార్యదర్శులు ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేసి న్యాయం చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం బలవంతంగా వలంటీర్లను రాజీనామాలు చేయిస్తూ ప్రతిపక్షాలపై అపవాద వేస్తున్నారన్నారు.

వలంటీర్ల రాజీనామా

గోరంట్ల, ఏప్రిల్ 3: మండలంలోని 93మంది గ్రామ వలంటీర్లు తమ విధులకు బుధవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. మండలంలోని వానవోలు 1, 2, సచివాలయాల్లో 39మంది, నారసింపల్లి పంచాయతీ 15మంది, పులేరులో పదిమంది, గౌనివారిపల్లి ఆరుగురు వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ సూర్యనారాయణకు రాజీనామా లేఖలు ఇచ్చారు. పాలసముద్రం పంచాయతీ నుంచి 23మంది వలంటీర్లు కార్యదర్శి నాగరాజుకు రాజీనామాలు అందించినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

అగళి, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని సీడబ్లూసీ సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మడకశిర మండలం నీలకంఠాపురంలోని ఆయన స్వగృహంలో బుధవారం అగళి మండలం ఇరిగేపల్లికి చెందిన వైసీపీ నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అందరికీ రఘువీరారెడ్డి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల కన్వీనర్ లోకేష్, యూత్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు ఇరిగేపల్లి డైరీ గోవిందప్ప, నర్సేగౌడ్, నరసప్ప, వెన్నసప్ప తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

రెండు బస్సులు ఢీ.. డ్రైవర్ల పరిస్థితి విషమం

పావగడ, ఏప్రిల్ 3: తాలూకాలోని లింగదహళ్లి నుంచి బెంగళూరుకు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు, పావగడ నుంచి చిత్రదుర్గం వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు కోట గుడ్డం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సుల డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం బుధవారం ఉదయం 7 గంటల సమయంలో జరిగింది. రెండు బస్సుల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు వారిని 108 వాహనంలో పావగడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సులు

నేడు కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప నామినేషన్

పావగడ, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ చిత్రదుర్గం ఎంపీ అభ్యర్థి చంద్రప్ప గురువారం నామినేషన్ వేయనున్నారు. ఆయన మధ్యాహ్నం ఒంటి గంటకు నామినేషన్ దాఖలు చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ బీసీఎం సభ్యుడు మైలారరెడ్డి తెలియజేశారు. ఎనిమిది తాలూకాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 3: పేదలకు అన్ని విధాలుగా అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రులు ఉండాలని, అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ జిల్లాస్థాయి ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సౌకర్యాలు, వైద్యులతీరు, మందులు అందుబాటులో ఉండడం తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది వందశాతం పేదలే అన్నారు. అలాంటి ఆసుపత్రుల్లో ఏ ప్రభుత్వమైనా మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. హిందూపురం జిల్లా స్థాయి ఆసుపత్రి ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాతి స్థానంలో ఉందన్నారు. మరి అంతటి స్థాయి ఉన్న ఈ ఆసుపత్రిలో ఏళ్ల తరబడి సీటీ స్కానింగ్ యంత్రం మూలన పడిందన్నారు. గుండె చికిత్సా విభాగంలో సీలింగ్ ధ్వంసమైందని, వర్షం వస్తే నేరుగా నీరు రోగుల మీద పడే అవకాశం ఉందన్నారు. డయాలసిస్ విభాగంలో ఏసీలు పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎలుకలు రాజ్యమేలుతుంటే వాటిని చర్యలు చేపట్టాల్సిన విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆసుపత్రిలో సదుపాయాలు సరిగా లేవని, శానిటేషన్ మెరుగుపరిచి డెటాల్‌తో శుభ్రపరిచి దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించకపోతే ఉద్యమిస్తానని స్వామి హెచ్చరించారు.



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి

నిరుపయోగంగా చెత్తతో సంపద కేంద్రాలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 3: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆయా పంచాయతీ కేంద్రాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటుచేసింది. అందుకు తగు సిబ్బందిని ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం ఆ కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు సరిగా వేతనాలు ఇవ్వక పోవడంతో వారు పనులు చేయడం మానుకున్నారు. ఈ కారణంగా చెత్తను తొలగించే వారులేక పోవడంతో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయో గంగా మారాయి. అంతేగాకుండా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. మండలంలో 16 పంచాయతీలలో 16 చెత్తతో సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 57 మంది కార్మికు లు పనిచేస్తున్నారు. వారు గ్రామాల్లో చెత్తను సేకరించి దానిని గ్రామ సమీపం లో ఉన్న సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. ఆ చెత్తతో అక్కడ ఎరువు తయారుచేస్తారు. ఆ ఎరువును రైతులకు అమ్మగా పంచాయతీకి ఆదాయం వస్తుంది. గ్రామాలు నిత్యం శుభ్రంగా ఉండేవి. అయితే ప్రస్తుతం పంచాయతీలలో నిధులు లేకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు చెత్త సేకరణ పనులకు రావడం లేదు. కార్మికులకు ఒక్కొక్క కార్మికుడికి 10 నుంచి 15 నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టం కావడంతో కార్మికులు ఇతర పనులకు వెళ్తున్నారు. గ్రామాలను శుభ్రం చేసేవారు లేక చెత్త పేరుకు పోయి అపరిశుభ్రత నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తతో సంపద కేంద్రాలు పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పలు పంచాయతీ ల కార్యదర్శులు మాట్లాడుతూ... పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. వారు చెత్తసేకరణ పనులకు రావడం లేదన్నారు. దీంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొనడమే గాకుండా, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నట్లు తెలిపారు.



మెళవాయి గ్రామంలో నిరుపయోగంగా చెత్తతో సంపద కేంద్రం

అపరిశుభ్రంగా గ్రామాలు

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

లేపాక్షి, ఏప్రిల్ 3: మండలంలోని కంచిసముద్రం, కొండూరు పంచాయతీలలో దాదాపు 30కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పీపీ శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో వైసీపీ విజయానికి అహర్నిశలు కష్టపడ్డామని అయితే తమకు పార్టీ ఎలాంటి గుర్తింపు లేదన్నారు. పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ టీడీపీలో చేరామన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని విశ్వసించినట్లు తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో కొండూరు మాజీ సర్పంచ్ శివప్ప, గోపాల్, తిమ్మగానిపల్లి నరసింహప్ప, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'ప్రజల కష్టాలు తీరాలంటే టీడీపీని ఆదరించాలి'



కె-వడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఏప్రిల్ 3: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని ప్రజల కష్టాలు తీరుతాయని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ రంగారెడ్డి, బేకరీ గంగాధర్, శ్రీదేవి తదితరులు బుధవారం మండలంలోని కే వడ్డిపల్లి, నల్లరాళ్లపల్లిల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మీసేవ సూరి, సూర్యనారాయణ, నాగార్జున, నారాయణప్ప, వెంకటేష్, ఉరుము నంజుండ, బాబు, నరేష్, హరీష్, వెంకటసుబ్బయ్య, సోము, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : టీడీపీ



వీవర్స్‌కాలనీలో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 3 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. హిందూపురం మండలంలోని వీవర్స్‌కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలో ఉన్న అంశాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనతో సామాన్య కుటుంబాలు బలైపోతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, అరుణాచల్‌రెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, హెచ్‌ఎన్ రాము, ఆదినారాయణప్ప, మల్లికా ర్జున, ఆంజనేయులు, సూరి, చిక్కీరప్ప, నాగేంద్ర, ప్రకాశ్, రషీద్, నరసింహ లు, మంజునాథ్, చిన్నారెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవరచుకోవాలి'



స్కౌట్ శిబిరానికి హాజరైన విద్యార్థులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 3: విద్యార్థి దశ నుంచే దేశ భక్తిపై ఆసక్తి పెంచుకోవాలని, ఆ విధంగా పిల్లలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి తల్లితండ్రిపై ఉందని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. మండల పరిధిలోని పూలకుంట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపునకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న తనం నుంచి దేశం పట్ల, ప్రజల పట్ల, తలితండ్రుల పట్ల బాధ్యతగా, ప్రేమగా మెలగాలని సూచించారు. దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు స్కౌట్, ఎన్‌సీసీ, ఎంతగానో తోడ్పడుతాయన్నారు. చదువుతోపాటు క్రీడలు, స్కౌట్, ఎన్‌సీసీ పట్ల అవగాహన పెంచి అన్ని రంగాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3: మండలంలోని ఇనగలూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మనోహర్‌నాయుడుకు చెందిన తోటలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించి అల్లనేరేడు, మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. రెండు ఎకరాల పొలంలో నాలుగు సంవత్సరాలుగా అల్లనెరేడు, మామిడి చెట్లు పెంచామని, బుధవారం ఉదయం ఇసుకను తరలించే కొంతమంది తోటకు సమీపంలోని గుబురుగా ఉన్న చెట్లకు నిప్పు పెట్టారని, నిప్పురవ్వలు తోటలోకి వ్యాపించి ప్రమాదం జరిగిందని బాధితుడు వాపోయా డు. దాదాపు రెండువందల చెట్లు కాలిపోయాయన్నారు. రూ.5లక్షలు నష్టం జరిగిందన్నారు. తాను, స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మూడు రోజులుగా తెరుచుకోని పోస్టాఫీసు



తాళం వేసి ఉన్న రొద్దం పోస్టాఫీసు

రొద్దం, ఏప్రిల్ 3 : మండలకేంద్రంలోని పోస్టాఫీసు మూడు రోజులుగా పనిచేయడంలేదు. దీంతో ఖాతాదారులు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసుకు బుధవారం తాళాలు వేశారు. పోస్టాఫీసులో పనినిమిత్తం అక్కడికి వెళ్లిన రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్ తాళం వేసి ఉండడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు రూ.20వేలు నగదు అవసరం కాగా మూడు రోజుల నుంచి పోస్టాఫీసు వద్దకు వస్తున్నానని తెలిపారు. అయితే తాళాలు వేయడం చూసి తిరిగి వెళ్తున్నట్లు తెలిపారు. దీనిపై పోస్టాఫీసు సిబ్బందిని ప్రశ్నించగా ఒకరోజు కరెంటు లేదని, మరోమారు నగదు లేదని బంద్ చేసినట్లు సమాధానం చెబుతున్నారని వాపోయారు. ఆ శాఖ ఉన్నతాధికారులు విషయాన్ని గమనించి స్థానిక పోస్టాఫీసు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు.